క్లుప్తంగా

రైతులకు పవర్ స్ప్రేయర్ల అందజేత



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): వందేమాతరం భారత్ వికాస్ పరిషత్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని సన్న, చిన్న కారు రైతులకు కూరగాయల విత్తనాలు, పవర్ స్ప్రేయర్లను ఆదివారం అందజేశారు. కిసాన్ సమృద్ధి యోజన కార్యక్రమాన్ని పురస్కరించుకొని రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాలు, పవర్ స్ప్రేయర్లు అందజేశామని భారతీయ కిసాన్ సంఘ్, ఆల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ జలగం కుమారస్వామి తెలిపారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు తేలప్రోలు వీరయ్య గుప్తా, కదం కృష్ణమూర్తి, కొత్తమాసు బ్రహ్మానందం, ప్రోగ్రామ్ చైర్మన్ ఎం.ప్రసాద్, రాజ్‌జైన్, చుండూరు మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రకాశరావుకు ఘన నివాళి



ఇబ్రహీంపట్నం: సీపీఐ సీనియర్ నాయకుడు, ప్రజానాట్య మండలి జిల్లా మాజీ అధ్యక్షుడు నడకుదిటి సూర్యప్రకాశరావు (84) సంస్మరణ సభ ఇబ్రహీంపట్నంలో ఆయన నివాసం వద్ద ఆదివారం జరిగింది. ఇటీవలి కాలంలో వయోభారంతో అనారోగ్యానికి గురై మృతిచెందిన ఆయనకు కుటుంబ సభ్యులు సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. సూర్యప్రకాశరావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, నగర కార్యదర్శి కాసాని గణేష్‌బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి యలమందరావు, కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి ఏడో వార్డు సభ్యుడు యండూరి ప్రణీత్ ఆదివారం ఆగిరిపల్లి పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు, ముఠా కార్మికులు సుమారు వంద మందికి బిర్యానీ ప్యాకెట్లు, టవల్స్ అందజేశారు. తన తండ్రి జగన్మోహన్‌రావు జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు.

జర్రిగొడ్డు హల్‌చల్



తిరువూరు: స్థానిక పాత తిరువూరు వెంకటాచలస్వామి ఆలయ సమీపంలోని ఒక నివాసగృహంలో మూడు రోజులుగా జర్రిగొడ్డు పాము హల్‌చల్ చేస్తోంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఏడు అడుగులు పొడవు ఉన్న ఈ పామును పట్టుకునేందుకు యత్నిస్తున్నా తప్పించుకుపోవడంతో ఇంటి యజమాని జగన్ మోహనాచారితో పాటు స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు ఆదివారం రాజుపేటకు చెందిన ఉయ్యూరు జయప్రకాష్ ఈ పామును పట్టుకుని అడవుల్లో వదిలారు.

రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సిద్ధం



పెనమలూరు: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. మండల పరిధిలో దాదాపు ఆరున్నర వేల ఎకరాలు రైతులు వరి సాగు చేస్తారు. ఇక్కడ వరి పండించే పొలాలకు అనుగుణంగా ఎంటీయూ 1318, ఎంటీయూ 1061 రకం వరి విత్తనాలు రైతుభరోసా కేంద్రాలకు వచ్చాయి. క్వింటా వరి విత్తనాలకు రూ.500 సబ్సిడీ ఉంది. కేజీ వరి విత్తనాలు సబ్సిడీ పోను రూ.34.80 వంతున రైతులకు ఇస్తారు. మండలానికి వరి విత్తనాలు 140 క్వింటా కావాల్సి ఉండగా ప్రస్తుతం 1318 రకం 60 క్వింటాళ్లు, 1061 రకం వరి విత్తనం 70 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. రైతులకు మరిన్ని వరి విత్తనాలు అవసరమైతే తెప్పించి రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు.

విజ్ఞానం.. వినోదం





కొండపల్లి శాఖ గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్) : కొండపల్లి గ్రంథాలయంలో చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

- గ్రంథాలయాల్లో ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేలా శిక్షణ
- విజేతలకు బహుమతుల ప్రదానం

ఇబ్రహీంపట్నం: గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞానం అందించే భాండాగారాలుగా విరాజిల్లుతున్నాయి. ఎందరినో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే గ్రంథాలయాల్లో ప్రతి ఏడాది జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థుల్లో మేధస్సు పెంపొందించేలా రూపొందించిన వేసవి శిక్షణ శిబిరాలు మే 15వ తేదీ నుంచి ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ పుస్తక పఠనంలో ఉన్న సంతృప్తి కంప్యూటర్ రంగంలో లేదని చెబుతారు.

వేసవి శిబిరాల్లో మెరుగైన శిక్షణ

మైలవరం నియోజకవర్గంలోని గ్రంథాలయాల్లో ఈ ఏడాది వేసవిలో నిర్వహించిన శిక్షణ శిబిరాలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాలబాలికలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. పుస్తక పఠనంతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందేలా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కథలు, రంగోలి, చిత్రలేఖనం, పాటలు, డ్యాన్స్, దేశభక్తి గేయాలు, పుస్తక ప్రదర్శన, చదరంగం, మ్యూజికల్ చైర్స్, క్యారమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించారు. బాలబాలికల్లో నూతన ఉత్సాహం, ఉత్తేజం నింపారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంచారు. ప్రతిభ చాటిన వారితో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు.



జి.కొండూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో ప్రశంసా పత్రాలు పొందిన బాలబాలికలు

నియోజకవర్గంలో 8 గ్రంథాలయాలు

మైలవరం నియోజకవర్గంలో 8 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం-2, జి. కొండూరు-1, రెడ్డిగూడెం-1, మైలవరం-2, గొల్లపూడి-1, గుంటుపల్లిలో మినీ గ్రంథాలయం-1 ఉన్నాయి. సరస్వతీ నిలయాలుగా వెలుగొందుతున్న గంథాలయాల్లో పొందుపర్చిన పుస్తకాలు ఎందరో నిరుద్యోగులు, విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడుతున్నాయి. ఇక్కడి పుస్తకాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరినవారు ఎందరో ఉన్నారు. అందుకే మంచి పుస్తకం మంచి స్నేహితుడితో సమానమని పెద్దలు చెబుతారు.

వేసవి శిక్షణ ఉపయోగపడింది



గ్రంథాలయంలో 23 రోజుల పాటు జరిగిన వేసవి శిక్షణ శిబిరం నాకు ఎంతగానో ఉపయోగపడింది. పుస్తక పఠనం, చిత్రలేఖనంలో శిక్షణ పొందాను. గతంలో బొమ్మలు వేయడం నాకు వచ్చేది కాదు. శిక్షణతో ఈరోజు మంచి బొమ్మలు వేయగలుగుతున్నాను. మెరుగైన ప్రతిభతో ప్రశంసాపత్రం, మెమెంటో అందుకున్నాను.

– ఎస్‌కే సుహాన్, 9వ తరగతి, కొండపల్లి

విద్యార్థులకు ఉత్తమ శిక్షణ



గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతంగా నిర్వహించాం. విద్యార్థులకు అన్ని విభాగాల్లో ఉత్తమ శిక్షణ అందించాం. చిత్రలేఖనం, చదరంగం, పుస్తక పఠనం, రంగోలి, క్రీడల్లో శిక్షణ విద్యార్థుల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి. వారు పొందిన మెమెంటో, ప్రశంసా పత్రాలు జీవితంలో గుర్తుగా మిగిలిపోతాయి.

– వి.విజయకృష్ణ, గ్రంథాలయ అధికారి, జి.కొండూరు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



నూజివీడు: మండలంలోని గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని పొట్లూరి రాధికారాణి ఆధ్వర్యంలో హైస్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది గ్రామంలో శనివారం రాత్రి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఉన్న సదుపాయాలను, వసతులను వారికి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది అత్యధికంగా 570 మార్కులు సాధించారని చెప్పారు. హైస్కూల్‌లో చక్కని ల్యాబ్ సౌకర్యం, లైబ్రరీ, మినరల్ వాటర్, ప్రభుత్వం వారిచే ఉచిత పుస్తకాలు, అత్యుత్తమ బోధన, విశాల ఆట స్థలం ఉన్నాయని చెప్పారు. చదువుతోపాటు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దుతామన్నారు. తమ పిల్లలను గొల్లపల్లి హైస్కూల్‌లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, దుర్గామల్లేశ్వరి, పోలసానిపల్లి స్కూల్ ప్రధానోపాధ్యాయులు శేఖర్‌బాబు, తెలుగు ఉపాధ్యాయులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు పాల్పడితే నగర బహిష్కరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అల్లర్లు, వివాదాలకు పాల్పడితే నగర బహిష్కరణ తప్పదని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ హెచ్చరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నగర బహిష్కరణ చేసేందుకు కూడా వెనకాడమన్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించకుండా మీ జీవితాలను మీ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడుపుకోవాలని సూచించారు. అనంతరం రౌడీషీటర్లను పేరుపేరున ఆరా తీయడంతో పాటు వారి దిన చర్య గురించి అడిగి తెలుసుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించినా, స్థానికంగా ఎటువంటి వివాదాలకు పాల్పడినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కొత్తపేట సీఐ గణేష్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు ఎన్నికల్లో ఓటమికి ఆందోళన చెందవద్దని, అన్నివేళలా తాము అండగా ఉంటామని తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల అనంతరం తెలుగుదేశం కార్యకర్తలు జరుపుతున్న దాడులను ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సంయమనం పాటిస్తూ వివాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. టీడీపీ క్యాడర్ రెచ్చగొట్టే యత్నం చేస్తున్నందున జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోతే పోరాడతామన్నారు. రానున్న స్థానిక సంస్థలు, సహకార సంఘాలు తదితర ఎన్నికలకు సంసిద్ధం కావాలని, ప్రజాబలం తమ పార్టీకే ఉందని చెప్పారు. తెలుగుదేశం ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించడానికి వైఎస్సార్ సీపీ క్యాడర్ ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, నరెడ్ల వీరారెడ్డి, రేగళ్ల మోహన్‌రెడ్డి, గత్తం నాగేశ్వరరావు, కలకొండ రవికుమార్, యరమల రామచంద్రారెడ్డి, కోట దాసు, ఏసురత్నం, చెరుకు నరసారెడ్డి, గజ్జల సీతారామారావు, మోదుగు ప్రసాద్, పరసా శ్రీనివాసరావు, షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ సుభాన్



సమావేశంలో మాట్లాడుతున్న కేఎంఏ సుభాన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎంఏ సుభాన్ అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వెల్ఫేర్ పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో కేఎంఏ సుభాన్ మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వ నిర్మాణంలో చంద్రబాబు పాత్ర కీలకమైందన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, సెక్యులర్ ఆకాంక్షలను నెరవేర్చాలని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్రం నుంచి సాధించాలని చంద్రబాబుకు సూచించారు. రాష్ట్ర ప్రజల కలల పంట పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు రాబట్టాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, కేజీ బేసిన్‌లో రాష్ట్ర వాటాను సాధించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు అందించే స్కాలర్‌షిప్స్ పునరుద్ధరణకు, వారి ఆర్థిక, విద్యా, వైద్య, ఉద్యోగ సాధనలో సహకారం అందించాలన్నారు. మత సామరస్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గంలో మైనారిటీలకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబుకు రాష్ట్ర కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జానీ, కార్యదర్శులు సత్యనారాయణ, హకీమ్, మున్వర్, కరీమ్, జమాన్, ఇనాయతుల్లా, కోశాధికారి మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



మాట్లాడుతున్న రిటైర్డు డిఫెన్స్ అధికారి శరత్

కంచికచర్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేబ్యాక్ టుది సొసైటీ అనే నినాదంతో పేద విద్యార్థులను ఆదుకునేందుకు కృషిచేస్తున్నట్లు అరుంధతీయ సేవాసమితి అధ్యక్షుడు, రిటైర్డు టీచర్ ముండ్లపాటి పోతరాజు తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు స్థానిక అరుంధతీ నగర్‌లోని అమితి బాప్టిస్టు చర్చి వద్ద ఆదివారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ డిఫెన్స్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ విశ్రాంత అధికారి శరత్, రైల్వేశాఖ రిటైర్డ్ అధికారి భాస్కరరావు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ సాహెబ్, స్వాస్ అధ్యక్షుడు మేడూరి రవికుమార్, ఇన్‌ఫాం ప్రెసిడెంట్ గడ్డం బాపిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ శేషం తిరుమలరావు పాల్గొని ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ పేదల విద్యాభివృద్ధికి అరుంధతీ సేవా సమితి కృషి అభినందనీయమన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరిచినవారికి మొదటి బహుమతిగా రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతిగా రూ.1000 నగదు అందజేసి వారిని దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. 90మంది విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఐలపోగు నాగేశ్వరరావు, కొండూరు నాగేశ్వరరావు, వేల్పుల ప్రభాకర్, నెమలి వాసు, మాడుగుల పాపారావు, మంగలపూడి రమేష్, మార్కపూడి జార్జి విక్టర్, శేషం గోపాలరావు, శేషం వెంకటరావు, ఐలపోగు పుల్లయ్య పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన 2003–2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సుమారు 20 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలోనే తిరిగి కలుసుకున్నారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మాజీ ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, బాబూరావు, శ్రీనివాసరావు, శశిరేఖ, వాణి, నరసమ్మ, నాగవేణి తదితరులను ఘనంగా సత్కరించారు. ఆత్మీయ సమ్మేళనంలో నెరుసు రాజేష్, నవీన్, సందీప్, రాజేష్, నైనవరపు లక్ష్మీ, భవిత పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం పలువురు చిన్నారులు నృత్య నీరాజనం అర్పించారు. విజయవాడకు చెందిన రాజేశ్వరి నృత్యనికేతన్‌కు చెందిన చిన్నారులు ఆంధ్ర నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేలు విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విజయవాడ పట్టణం, మాచవరం డౌన్ ప్రాంతానికి చెందిన మల్లెల రిషికేష్ సాయిశ్రీ రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ ఏఈఓ తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టి గారి పార్కు ప్రాంతంలో చనుమోలు శ్రీను కుటుంబం నివాసం ఉంటోంది. శ్రీనుకు ముగ్గురు సంతానం. కుమార్తె 7వ తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటుంది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల వారిని ఆరా తీయగా ఓ ఆటోలో వెళ్లినట్లు చెప్పడంతో ఆందోళన చెందిన శ్రీను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: వాహనదారులు తప్పక లైసెన్సు కలిగి ఉండాలని వీరులపాడు ఎస్‌ఐ మహాలక్ష్మణుడు సూచించారు. మండలంలోని పెద్దాపురం గ్రామం వద్ద ఆదివారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న పదిమందికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహనచోదకులకు సూచించారు. వాహనాలు నడిపే సమయంలో సరైన ధ్రువీకరణపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు.

అమ్మ సన్నిధిలో భక్తజనం





ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో భక్తజన సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆంధ్రా, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. పుష్కర ఘాట్, మెట్ల మార్గం, కనకదుర్గా నగర్, కొండపై భక్తుల కోలాహలం నెలకొంది. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









శ్రీహర్షకు ఉత్తమ సేవ అవార్డు



భవానీపురం(విజయవాడ పశ్చిమ): హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా ఆంధ్రప్రదేశ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ భవానీపురానికి చెందిన పీవీకె శ్రీహర్షకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ పక్షాన సేవలు అందిస్తున్న పలువురికి అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ.. మానవ హక్కులకు సంబంధించి ఎవరైనా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తున్న తమ సంస్థ ప్రతినిధుల సేవలను గుర్తించి ప్రోత్సాహకరంగా అవార్డులను అందచేస్తున్నామన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులకు భంగం కల్పించిన ఘటనలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాదులు రమణ కోటేశ్వరరావు, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.